క్లుప్తంగా

మహిళలకు ఆటల పోటీలు



ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వివిధ సేవా సెంటర్ల మహిళలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏరియా డీజీఎం పర్సనల్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. డీజీఎం కేశవరావు మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన ప్రగతివనంలో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ మజ్జిగ మురళి, సేవా కోఆర్డినేటర్ సాగర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు సహకరించండి



న్యూట్రిషన్ కిట్లను చూపుతున్న క్షయ బాధితులు

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి కవిత, డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. రొంపేడు పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా సమకూరిన న్యూట్రిషన్ కిట్లను క్షయ వ్యాధికి మందులు వాడుతున్న వారికి వైద్యాధికారులు అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు మాంసం, కోడిగుడ్లు, చేపలు, పాలపదార్థాలు, చిక్కుడు జాతి ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్ వంటి అధిక ప్రొటీన్ కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు క్షయ వ్యాధిగ్రస్తుల కోసం చేయూతనివ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శంకర్, హెచ్ఈఓ రాజు, పీహెచ్ఎన్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయండి

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు, కూలీలు కోరుతున్నారు. గ్రామం నుంచి సుమారు 3 కిలోమీటర్ల వరకు దారి వెంట పొలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మట్టి దారి ఏకొద్దిపాటి వాన కురిసినా బురదమయంగా మారుతుండటంతో రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పొలాలకు వెళ్లే దారి..

అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న సేవా అధ్యక్షురాలు రమ

ఇల్లెందు: పట్టణంలోని జేకేకాలనీ బ్లాక్ డైమండ్ స్టేడియంలో జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని సేవా అధ్యక్షురాలు రమ అన్నారు. పట్టణంలోని వైసీఓఏ క్లబ్‌లో రాష్ట్ర అవతరణ ఉత్సవాలపై సోమవారం సేవా సమితి ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా స్పోర్ట్స్, తెలంగాణ పరుగు తదితర వాటిల్లో సభ్యులు విధిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ మేనేజర్ సాయిస్వరూప్, సేవా కార్యదర్శి సులక్షణ, సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపు లీకేజీ

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం పంచాయతీ గంగాపురం గ్రామంలో సోమవారం రాత్రి మిషన్ భగీరథ పైపులైన్ లీక్ అయింది. నీటిని విడుదల చేసిన సమయంలో ఒక్కసారిగా పైపు లీకై నీరు వృథాగా వాగులోకి పోయింది. గమనించిన గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులు లీకేజీ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాతవి పడావు.. కొత్తది అసంపూర్తి

- ఇల్లెందులో అందుబాటులో లేని అతిథి గృహం
- అన్ని అవసరాలకు సింగరేణి గెస్ట్ హౌసే దిక్కు
- సా..గుతున్న మున్సిపల్ అతిథి గృహం నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ గెస్ట్ హౌస్

ఇల్లెందు: ఇల్లెందుకు విచ్చేసిన జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు కొద్ది సమయం విశ్రాంతి పొందాలంటే అందుబాటులో విశ్రాంతి గృహాలు లేవు. ఆర్అండ్‌బీ, ఫారెస్టు గెస్ట్ హౌస్‌లు పడావుపడ్డాయి. ఈ రెండు గెస్ట్ హౌస్‌ల ఆలనా పాలనా అడుగంటింది. ఇదిలా ఉండగా మూడేళ్ల కిందట మున్సిపాలిటీలో ఓ గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్టారు. కానీ, ఆ గెస్ట్ హౌస్ అసంపూర్తిగా మారింది. దీంతో ఇల్లెందులో అతిథి గృహాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఏఅధికారి అయినా ప్రజాప్రతినిధి అయినా సింగరేణి గెస్ట్ హౌస్ మీద ఆధారపడాల్సి వస్తోంది.

తెల్ల దొరల బంగళాలే..

ఇల్లెందు పట్టణానికి సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉంది. తెల్లదొరలు పాలించిన కాలంలో బొగ్గు అన్వేషణ జరిగింది. విశ్రాంతి కోసం బంగళాలు నిర్మించారు. నేటికీ ఆ బంగళాలే విశ్రాంతి గృహాలుగా ఉన్నాయి. ప్రస్తుతం ఆర్అండ్‌బీ, ఫారెస్టు ఆధీనంలో ఉన్న గెస్ట్ హౌస్ కూడా తెల్లదొరలు నిర్మించిందే. బొగ్గు అన్వేషణ కోసం వచ్చిన తెల్ల దొరలు అందులో విశ్రాంతి పొందారు. ఆర్అండ్‌బీ, ఫారెస్టు గెస్ట్ హౌస్‌లు నేడు ఆలనా పాలనా లేక శిథిలావస్థకు చేరాయి. ఇల్లెందులోని గోవింద్ సెంటర్‌లో ఉన్న ఈ రెండు గెస్ట్‌హౌస్‌లు కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆర్అండ్‌బీ, ఫారెస్టు గెస్ట్ హౌస్‌లు 1916లో నిర్మించారు.



శిథిలావస్థకు చేరిన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్



శిథిలావస్థకు చేరిన ఫారెస్టు గెస్ట్ హౌస్

మున్సిపల్ గెస్ట్ హౌస్..

ఇల్లెందు మున్సిపాలిటీలో కూడా ఒక గెస్ట్ హౌస్ ఉండాలని మూడేళ్ల కిందట రూ.36 లక్షలు కేటాయించి భవన నిర్మాణం చేపట్టారు. అయితే నిధులు సరిపడక మధ్యలో వదిలేశారు. ప్రస్తుతం మరో రూ.30 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిధులతో నిర్మాణం పూర్తి చేస్తే ఇక మున్సిపల్ గెస్ట్ హౌస్ అందుబాటులోకి రానుంది. దీని కోసం ఎదురు చూస్తున్నారు. ఇది పూర్తయితే సింగరేణి గెస్ట్ హౌస్‌కు రద్దీ తగ్గుతుంది.

పట్టని పర్యవేక్షణ..

ఆర్అండ్‌బీ, ఫారెస్టు, పోలీస్ గెస్ట్ హౌస్‌లకు అనేక సదుపాయలు ఉన్నాయి. వందల వాహనాల పార్కింగ్‌కు సరిపడా విశాలమైన స్థలం ఉంది. ఇక నీటి కోసం బోరు, మోటార్, నీరు నిల్వ కోసం సంపు, వంటశాలలు అన్నీ ఉన్నాయి. ఈ రెండు గెస్ట్ హౌస్‌లకు రెండు గదులు, ఒక హాల్, డైనింగ్ రూం, కుర్చీలు, బల్లాలు, టేబుళ్లు, మంచాలు, పరుపులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, కిచెన్, తగిన ఫర్నిచర్ అంతా ఉంది. కేవలం పర్యవేక్షణ లేక, నిధుల కేటాయింపు జరగక శిథిలం అవుతున్నాయి. గెస్ట్ హౌస్‌ల చుట్టూ ప్రహరీ లేక పశువులు లోపల ఆవాసంగా మార్చుకుంటున్నాయి.

తుది దశలో గెస్ట్‌హౌజ్ పనులు



ఇల్లెందు మున్సిపల్ గెస్ట్ హౌస్ నిర్మాణం పనులు తుది దశకు చేరాయి. గతంలో రూ.30 లక్షలు కేటాయిస్తే సరిపోలేదు. ప్రస్తుతం మరో రూ.30 లక్షలు కేటాయించాం. ఈ నిధులతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తాం. త్వరలో పనులు పూర్తి అవుతాయి.

–మురళీ, డీఈ, ఇల్లెందు మున్సిపాలిటీ

నిధులు కేటాయించాలి..



ఇల్లెందులో ఉన్న గెస్ట్ హౌస్‌లకు ప్రభుత్వం.. ముఖ్యంగా ఆయా శాఖలు నిధులు కేటాయించాలి. ఉపయోగంలోకి తీసుకుని రావాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఆర్అండ్‌బీ, ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లను వినియోగించుకోవాలంటే అవి శిథిలావస్థకు చేరాయి.

–రమేశ్‌బాబు, ఇల్లెందు

క్యాంప్ కార్యాలయంపై దాడి హేయం

పాల్వంచ/సూపర్‌బజార్(కొత్తగూడెం): సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్యను అడ్డుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమని పేర్కొన్నారు.

లాఠీచార్జ్ అమానుషం

ఇల్లెందు: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారని, బీఆర్ఎస్ నేతలు అడ్డుకోబోగా పోలీసులు లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడుల సంస్కృతి ఎప్పటికీ మంచిది కాదని స్పష్టం చేశారు.

సీపీఆర్ఎంఎస్‌పై రూ.19.05 కోట్ల ఆదాయం

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ (సీపీఆర్ఎంఎస్ - ఎన్ఈ)లో ఉన్న 80 వేల మంది కార్మికుల కంట్రిబ్యూషన్ మొత్తం రూ.259 కోట్లపై రూ.19.05 కోట్ల ఆదాయం (వడ్డీ) వచ్చిందని జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవీ కిరణ్‌కుమార్ తెలిపారు. జీఎం (వెల్ఫేర్)గా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024లో కార్మికుల నుంచి వసూలైన డబ్బులకు ఈ వడ్డీ వచ్చిందన్నారు. ఇంకా కొందరు కార్మికులు ఈ స్కీమ్‌లో చేరాల్సి ఉందని, వారు చేరితే దంపతులకు రూ.8 లక్షల వరకు వైద్య సదుపాయం కల్పించనున్నామని చెప్పారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి వైద్యం కోసం పలువురు సోమవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని బోయితండా జీపీ సర్వేతండాకు చెందిన రాజేశ్వరి రెండేళ్ల కిందట తండ్రిని కోల్పోయింది. ప్రస్తుతం తల్లి అనూష, సోదరి లావణ్యతో కలిసి అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. ఈ నెల 23న మేనమామతో కలిసి ఖమ్మం వెళ్తుండగా తిలక్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేశ్వరి తీవ్రంగా గాయపడింది. ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. భర్తను కోల్పోయి రెక్కల కష్టం మీద జీవనం సాగిస్తున్న అనూష వైద్య ఖర్చులు భరించే స్థితిలో లేదు. రాజేశ్వరి కాలుకు సర్జరీ చేసేందుకు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో అనూష కన్నీరుమున్నీరైంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రాజేశ్వరి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. సోమవారం గ్రామానికి చెందిన బానోత్ జగదీశ్, వంశీ, ప్రేంకుమార్, జగదాగ్, రవి, లక్ష్మణ్, రూప్‌లాల్ తదితరులు స్థానిక ప్రభుత్వ వైద్యులు రాంనివాస్, బన్సీలాల్‌తో కలిసి ఖమ్మంలోని వైద్యులతో మాట్లాడి రాజేశ్వరి కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన వైద్యులు వైద్య ఖర్చులో సగం మాఫీ చేసేందుకు అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద రూ.5 వేలను రాజేశ్వరి తల్లికి వారు అందజేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో సేకరించిన రూ.18 వేల నగదును సోమవారం సాయంత్రం ఫోన్‌పే ద్వారా గ్రామస్తులు అందించారు.

29న హుండీ కానుకల లెక్కింపు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 29న లెక్కిస్తామని ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. మార్చి 10వ తేదీ నుంచి ఈ నెల 28వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఉదయం 9 గంటలకు మొదలవుతుందని ఆమె వెల్లడించారు.

వైఎన్ఎస్‌ఏ సర్టిఫికెట్ అందుకున్న గూడెంవాసి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఆక్యుప్రెషర్ సైన్స్ డ్రగ్లెస్ థెరపీలో హీలర్‌గా ఉన్న హెచ్ఆర్ జి.సుగుణారావు వైఎన్ఎస్ఏ కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్ అందుకున్నాడు. ఆదివారం రాత్రి ఓయూలో జరిగిన ప్రకృతి ఆరోగ్య మహాసభల్లో సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు ఆయన సోమవారం పేర్కొన్నారు. సర్టిఫికెట్ రావడంపై జయరాజు, కృష్ణయ్య, వెంకటయ్య, రాజశేఖర్, ముస్తఫా, శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

బస్సు ఏర్పాటు చేయాలి

ఇల్లెందు: ఇల్లెందు నుంచి మాణిక్యారం – బోయితండా – కొమరారం మీదుగా బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు బోయితండా ప్రజలు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఇల్లెందులోని జేకే క్యాంపు కార్యాలయం వద్దకు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు.. మాణిక్యారం, బోయితండా కొమరారం పంచాయతీల నుంచి మహిళలు ప్రతీ రోజు సమావేశాలకు ఇల్లెందుకు వస్తున్నామని తెలిపారు. అనంతరం బస్ సర్వీస్ నడపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగమణి, బాయమ్మ, స్రవంతి, రమ ఉన్నారు.

కొప్పురాయిలో వారాంతపు సంత

టేకులపల్లి: మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామం కొప్పురాయిలో సోమవారం వారాంతపు సంతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే టేకులపల్లిలో ప్రతి శనివారం వారాంతపు సంత కొనసాగుతోంది. మండలం నలుమూలల నుంచి ప్రజలు టేకులపల్లికి వచ్చి కొనుగోలు చేసేవారు. తాజాగా కొప్పురాయి గ్రామంలో పలువురు చిరు వ్యాపారులు స్వచ్ఛందంగా ప్రతి సోమవారం సంత నిర్వహించేందుకు పూనుకున్నారు. బోడు, గంగారం, బొమ్మనపల్లి, తావుర్యాతండా గ్రామాల్లోనూ వారాంతపు సంతలు ఏర్పాటు చేస్తే ప్రజలకు దూరభారం తగ్గి సమీపంలోనే కావాల్సిన అన్ని రకాల వస్తువులను కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంటుందని పలువురు చెబుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

టేకులపల్లి: రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలు అందజేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పరబోయిన రామ్మూర్తి, కొమరం సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పోలూరి ముత్తయ్యకు వినతిపత్రం అందించి మాట్లాడారు. నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి మారయ్య, బుర్ర బుచ్చమ్మ, మంగ వెంకటమ్మ, రమ, మౌనిక, శ్రీను, వెంకన్న, ధనంజయ, సుమన్, గుగ్గిళ్ల పాపారావు పాల్గొన్నారు.

లాయర్లకు ఐఎల్‌పీఏ సభ్యత్వాలు



సభ్యత్వం స్వీకరిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో పలువురు న్యాయవాదులు సోమవారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) సభ్యత్వాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేశ్, న్యాయవాది పగిడిపల్లి శ్రీకాంత్‌కు బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్‌లో ఐఎల్‌పీఏ జిల్లా కన్వీనర్ జె.గోపీకృష్ణ సభ్యత్వాలు అందజేశారు. అనంతరం కామేశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగపరమైన విలువలకు ప్రాధాన్యతనిచ్చే సంస్థలో సభ్యత్వం పొందడం గర్వంగా ఉందని తెలిపారు. అలాగే, గోపీకృష్ణ మాట్లాడుతూ.. సమాజసేవపై నిబద్ధత కలిగిన న్యాయవాదులు సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మారపాక రమేశ్‌కుమార్, సాదిక్‌పాషా, అంబటి రమేశ్, సరిత, వడ్లకొండ హరిప్రసాద్, కనకం చిన్నికృష్ణ, ధరావత్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

శెట్టుపల్లికి బస్సు సర్వీస్ హర్షణీయం



నినాదాలు చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఇల్లెందు: గుండాల మండలంలోని మారుమూల పల్లె శెట్టుపల్లికి ఆర్టీసీ బస్సు నడపడం హర్షణీయమని మాస్‌లైన్ నేతలు చంద్ర అరుణ, నాయిని రాజు, యాకూబ్‌షావలి అన్నారు. ఇల్లెందు బస్ డిపో వద్ద సోమవారం మాస్‌లైన్ నేతలు సమావేశం నిర్వహించారు. మాస్‌లైన్, పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పలు దఫాలుగా నిర్వహించిన ఆందోళనల ఫలితంగా ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు వాంకుడోత్ అజయ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఉన్న ప్రతీ పల్లెకు బస్సులు నడపాలి

ఇల్లెందురూరల్: బీటీ రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు నడపాలని మాస్‌లైన్ నాయకులు ఆజ్మీర బిచ్చా, బుర్ర రాఘవులు డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో సోమవారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాల ఫలితంగానే శెట్టుపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారని, గతంలో ఇల్లెందు నుంచి మస్సివాగు, మాణిక్యారం, తుంటుబాలుతండా మీదుగా బోయితండా వరకు ఆర్టీసీ బస్సులు నడిపించారని గుర్తుచేశారు. గతంలో రాఘబోయిన గూడెం గ్రామపంచాయతీకి సైతం ఉండేదని, డిపో ఏర్పాటైనా బస్సు సౌకర్యం కల్పనపై అధికారులు దృష్టిసారించడం లేదని పేర్కొన్నారు.

జూన్ 8న ఖమ్మంలో సభ



కరపత్రం అందిస్తున్న రాజేశ్‌నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గిరిజన హక్కుల సాధనకు రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యాచరణ సభను జూన్ 8న ఉదయం 11 గంటలకు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న ఐఎంఏ హాలులో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ అందజేశారు. ఎస్టీల 10 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, రిజర్వేషన్‌ను 7.5 శాతం నుంచి 14 శాతానికి పెంచాలనే డిమాండ్లతో సభ జరుగుతుందని రాజేశ్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పంతుల్యానాయక్, ప్రకాష్‌దొర, కుశాల్‌నాయక్, సాయినాయక్, గనినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో ఘనంగా బోనాలు



బోనాలు తీసుకొస్తున్న మహిళలు

సుజాతనగర్: ప్రతీ రెండేళ్లకోసారి నిర్వహించే అంకమ్మ, మహాలక్ష్మి జాతర పూజలు రాఘవాపురం గ్రామంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అంకమ్మ తల్లి ఆలయంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట, గణపతి పూజ, పుణ్యావాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని ముత్యాలమ్మకు అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించారు. మహిళలు, యువతులు ఇంటికో బోనాన్ని నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ముత్యాలమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో, పాడి పంటలతో చల్లగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

దాణాగా అజొల్లా వేయొచ్చు..



అజొల్లా విత్తనాలు చల్లుతున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: అజొల్లాను పెంచి.. పశువులకు దాణాగా ఉపయోగించవచ్చని, ఎండుగడ్డి కొరత ఏర్పడినప్పుడు ఇది ప్రత్యామ్నాయంగా ఉంటుందని ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోగ్గూడెం గ్రామంలో రైతు బాబా ఇంటి ఆవరణలో సోమవారం ఆయన అజొల్లా విత్తనాన్ని చల్లి మాట్లాడారు. అజొల్లాను రైతులు ఇంట్లో పెంచుకునేందుకు రూ.16 వేల చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, టీఏ సుజాత, దేవరాజ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు పెన్షన్ ప్రకటించాలి



మాట్లాడుతున్న నర్సయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజైన జూన్ 2వ తేదీన తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్ ప్రకటించాలని తొలిమలి 1969 తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 నుంచి 2014 వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేసి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నామన్నారు. రాష్ట్ర సాధన తరువాత ఉద్యమకారులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో దేవులపల్లి రామ్మూర్తి, కూచన కృష్ణారావు, వలీబాబా, కాకెల్లి సైమన్, డి.మల్లయ్య, సత్తార్‌బేగ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తవ్వారు.. వదిలేశారు..

మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతుల పేరుతో గుంతలు తవ్వి వాటిని పూడ్చకుండానే వదిలేశారు. ఓ హోటల్, కిరాణం, ఓ ఇంటి ఎదుట సుమారు రెండు వారాల కిందట గుంతలు తవ్వారు. మరమ్మతులు చేశారు. నేటికీ ఆ గుంతలను పూడ్చలేదు. కేటీసీకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు అధికంగా ఉన్నాయి. ఎవరైనా అదుపుతప్పి ఆ గుంతల్లో పడితే ప్రమాదం జరిగితే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

టేకులపల్లి:



ప్రశ్నించాల్సిన అధికారి : ఉప్పు దీప్తి
టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి
సెల్ నెంబర్ : 9640766281